సాక్షి
మెదక్
గురువారం । 10 । ఆగస్టు । 2023



కన్నవారికి కడుపు కోత మిగిల్చి..

ఉన్నత చదువు కోసం ట్రిపుల్ ఐటీకి వెళ్లిన తమ కుమారుడు విగత జీవిగా ఇంటికి తిరిగి రావడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధించారు. 8లో



గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. 9లో

నేడు ఆర్టీసీ డీఎం ఫోన్ ఇన్

మెదక్: ఈనెల 10న, (నేడు) ఆర్టీసీ డీఎం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని డీఎం సుధా తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, ప్రజలు, ప్రయాణికులు ఏదైనా సమస్యలు, సలహాల కోసం 9959226268 నంబర్‌లో ఫోన్ చేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

పీడీఎస్ లారీలకు జీపీఎస్ తప్పనిసరి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: పీడీఎస్ బియ్యం తరలించే లారీలకు జీపీఎస్‌ను కనెక్ట్ చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు, స్టేజ్–1, 2, బఫర్ గోదాం ఇన్‌చార్జ్‌లతో పీడీఎస్ మూవ్‌మెంట్ చేయాలని, స్టేజ్–2 కాంట్రాక్టర్లను జీపీఎస్ ఉన్న లారీల్లో మాత్రమే తరలించాలన్నారు. అవకతవకలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, రేషన్ డీలర్లు సకాలంలో ప్రజలకు రేషన్‌ను పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరా అధికారి బ్రహ్మరావు, అధికారులు రాజేశ్వరి, సాధిక్ హుస్సేన్, అహ్మద్, మండల స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు పాల్గొనారు.

అనాథ బాలలకు భృతి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారి బ్రహ్మాజీ

మెదక్ కలెక్టరేట్: అనాథ బాలలకు కేంద్ర ప్రభుత్వం మహిళా శాఖ ద్వారా రూ.4వేల భృతి అందిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ తెలిపారు. బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం, సామాజిక బాధ్యత అనే అంశంపై బుధవారం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో బాలల సంక్షేమం కోసం మహిళా, శిశు సంక్షేమ శాఖ కృషి చేస్తుందని, స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు. డీసీపీఓ కరుణశీల మాట్లాడుతూ బాలల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సున్నం సతీష్, ప్రసాద్, కృష్ణ వర్దన్ రెడ్డి, సాధన సంస్థ ప్రెసిడెంట్ చిక్కు మురళి, మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో రాణించాలి



మాట్లాడుతున్న బీమయ్య

హవేళీఘనపూర్: మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలని అడిషనల్ డీఆర్‌డీఓ భీమయ్య అన్నారు. మెదక్ ఎంపీడీఓ సమావేశ మందిరంలో సెర్ప్ యాక్టివిటీ గురించి మెదక్ క్లస్టర్ పరిధిలోని ఏపీఎం, ఏపీఓలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. శ్రీనిధి రుణాలతో వ్యాపారం ప్రారంభించి ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ప్రకాశ్ మోహన్, జానకి, వెంకటేశ్వర్లు, శ్రీనిధి ఆర్ఎం గంగారాం, మేనేజర్ శ్రీనాథ్, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతాం



మాట్లాడుతున్న మల్లికార్జున

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి ఆయా శాఖల్లో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. అసంఘటిత కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించి ఆర్థికంగా సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, బసవరాజు, ఉపాధ్యక్షులు బాలామణి, కోశాధికారి నర్సమ్మ, నాయకులు రాములు, సంగయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌పై నజర్



- అసెంబ్లీ టికెట్‌పై బీసీ అభ్యర్థుల ఫోకస్
- ముమ్మర ప్రయత్నాల్లో ఆశావహులు

మెదక్: సాధారణ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో నర్సాపూర్ నియోజకవర్గంపై బీసీ నాయకులు దృష్టి సారించారు. అసెంబ్లీ టికెట్‌ను తమ సామాజిక వర్గానికి కేటాయించాలనే డిమాండ్‌తో ప్రయత్నాలు ప్రారంభించారు. జనాభాలో అధిక శాతం ఉన్న తమకు పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలంటూ జిల్లాలో ఇటీవల జరిగిన పలు సమావేశాల్లో బహిరంగంగానే ప్రకటించారు. మరోవైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు టికెట్లు కేటాయించేందుకు సుముఖంగా ఉండడం కూడా వీరికి కలిసివచ్చే అంశంగా చెప్పవచ్చు. దీనికి అనుగుణంగా జిల్లాలోని బీసీ నాయకులు టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తమ అభ్యర్థిని పోటీలో ఉంచేందుకు పావులు కదుపుతున్నారు.



గాలి అనిల్‌కుమార్ | కల్లూరి హరికృష్ణ | మురళీ యాదవ్

బీఆర్ఎస్ నుంచి...
నర్సాపూర్ నుంచి ఎమ్మెల్యే మదన్ రెడ్డి మరోసారి పోటీకి సై అంటుండగా, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్, మాజీ మంత్రి సునీతారెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నారు. కాగా బీసీ కోటాలో ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, శివ్వంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ టికెట్ ఆశిస్తున్నారు. 2014, 2018లో రెండు సార్లు ఎంపీపీగా ఎన్నికైన హరికృష్ణ ప్రస్తుతం రేసులో ఉన్నారు.

బీజేపీలో...
బీజేపీ రాష్ట్ర నాయకుడు సింగాయిపల్లి గోపి గతంలో రెండు సార్లు పోటీ చేశారు. మరోసారి పోటీకి సిద్ధమవుతున్నారు. బీసీ కోటాలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీ యాదవ్ సైతం టికెట్ ఆశిస్తున్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం గోపికి ఉంది. ఆయన భార్య రాజమణి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పని చేశారు.

కాంగ్రెస్‌లో..
కాంగ్రెస్ పార్టీ నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షుడు, మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గాలి అనిల్‌కుమార్ సైతం టికెట్‌పై దృష్టి పెట్టారు. విస్తృతంగా పర్యటిస్తు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సొంత నియోజకవర్గం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి అవకాశం దొరకకుంటే నర్సాపూర్ నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్క నాటుతున్న కలెక్టర్ రాజర్షిషా

కలెక్టర్ రాజర్షిషా

మెదక్/మెదక్ కలెక్టరేట్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు చాలా విలువైందని, అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాలో 73 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 15రోజులపాటు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా ఫారం 6ను నింపి బీఎల్‌ఓకు అందించాలని, మొబైల్ వాహనంతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై గ్రామాల్లో ప్రచారం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ గణపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ
ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి శిక్షణ శిబిరం వాల్ పోస్టర్‌ను కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుస్సేన్, దొెట్టి రాంబాబు కెనాన్ మెంటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో 19న ఫొటోగ్రఫీలో వృత్తి నైపుణ్య శిక్షణ, టెక్నాలజీపై మెలకువలు నేర్పించనున్నట్లు తెలిపారు. బిట్ల నర్సింలు, గిర్ని ప్రభు, నాగరాజు, బసవరాజు, విగ్నేష్, బేతయ్య, గిరి, శ్రీకాంత్, రంజిత్‌కుమార్, సుమన్ ఉన్నారు.

ఆక్రమణలపై చర్యలు
హెచ్ఎండీఏ పరిధిలో చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నర్సాపూర్, శివ్వంపేట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, ఎస్ఈ యేసయ్య, ఈఈ శ్రీనివాస్‌రావు, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌తో నిరంతర విద్య

ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్ స్వామి

పాపన్నపేట(మెదక్): చదువు మధ్యలో ఆపేసిన వారికి ఓపెన్ స్కూల్ చక్కని అవకాశమని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకట్ స్వామి అన్నారు. బుధవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరించారు. వయసుతో సంబంధం లేకుండా నిరంతర విద్యకు ఓపెన్ స్కూల్ ఉపయోగపడుతుందన్నారు. ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఫైన్‌తో ఈనెల 31 వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ హరిసింగ్, నరేందర్, టీచర్లు పాల్గొన్నారు.

బడి మానేసిన వారికి వరం..
పెద్దశంకరంపేట(మెదక్): బడి మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరమని ఉమ్మడి జిల్లా ఆర్డినేటర్ వెంకటస్వామి అన్నారు. పెద్దశంకరంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లను ఆయన పరిశీలించారు. ఓపెన్‌స్కూల్‌లో ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విఠల్, ఖాదిర్, ప్రవీణ్ తదితరులున్నారు.



ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మానవ తప్పిదాలతో రోడ్డు ప్రమాదాలు

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

తూప్రాన్: మానవ తప్పిదాలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతాయని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బుధవారం తూప్రాన్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల పురుగతి, శాంతిభద్రతలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. నర్సాపూర్ డివిజన్ పరిధిలో, 44వ జాతీయ రహదారిపై తూప్రాన్ నుంచి రామాయంపేట వరకు 2023లో ఎక్కువ ప్రమాదాలు జరిగాయన్నారు. వ్యాపారులు దుకాణాల్లో, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అపరిచిత వ్యక్తులు ఇళ్లల్లో అద్దెకు దిగితే వారి ఆధార్, ఇతర గుర్తింపు కార్డును తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

బీజేపీ నిరసనకు తరలిరావాలి

ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్: అర్హులైన పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో నేడు మెదక్‌లో నిర్వహించే నిరసనకు ప్రజలు తరలి రావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్రనాయకుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళియాదవ్ కోరారు. బుధవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వరాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయనే ఆశపడిన ప్రజలకు నిరాశే ఎదురయ్యిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. పేదల జీవితాల్లో మార్పు లేదని, కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నల్లాల విజయ్, సత్యానారాయణ, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్

'సాక్షి' కథనాలకు స్పందన

మెదక్: జిల్లా సమస్యలపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాలకు జిల్లా యంత్రాంగం స్పందించింది. బుధవారం ప్రచురితమైన 'పశువైద్యం బహుదూరం' కథనంపై జిల్లా పశువైద్యాధికారి విజయశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఉన్న సిబ్బందితో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, త్వరలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 5న ప్రచురితమైన 'ఇంకెప్పుడు మనబడి' కథనంపై విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ.. రామాయంపేట జెడ్పీహెచ్ఎస్‌కు రూ.2.68 కోట్లతో నూతన భవనం నిర్మిస్తామని, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

అధికారంలోకి వస్తే రుణమాఫీ

డీసీసీ అధ్యక్షుడు కె. తిరుపతిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు కంటారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ధరిపల్లిలో పర్యటించి, కాంగ్రెస్ పథకాలపై వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ వస్తే... పేదలకు ఇండ్లు, ఉచిత బస్సు ప్రయాణం, రూ.4 వేల పెన్షన్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ తదితర పథకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోతరాజ్ రమణ, డీసీసీ కార్యదర్శి శ్రీమన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పల్లె రామ్‌చందర్‌గౌడ్, ఎంపీటీసీ అంజాగౌడ్, యూత్ మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

14న అప్రెంటీస్ మేళా

మెదక్ కలెక్టరేట్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 14న అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ పరిశ్రమల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్ తదితర సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడెటాతో మేళాకు హాజరు కావాలన్నారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుదారుల తిప్పలు

నర్సాపూర్: గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులు దరఖాస్తు చేసేందుకు పాట్లు పడుతున్నారు. ఇంటి స్థలం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తదితర డాక్యుమెంట్ల జిరాక్స్‌లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. 10వ తేదీతో గడువు ముగియనుండడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

దశల వారీగా..
శివ్వంపేట(నర్సాపూర్): అర్హులకు దశల వారీగా ప్రభుత్వం నుంచి గృహలక్ష్మి మంజూరు అవుతాయని ఎంపీపీ హరికృష్ణ అన్నారు. బుధవారం శివ్వంపేటలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మీసేవా కేంద్రాల వద్ద క్యూ
కౌడిపల్లి(నర్సాపూర్): గృహలక్ష్మి పథకానికి మూడు రోజులు మాత్రమే గడువు ఉందని ప్రచారం కావడంతో దరఖాస్తులు చేసుకునేందుకు లబ్ధిదారులు తిప్పలు పడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి కౌడిపల్లి మండల కేంద్రానికి వచ్చిన లబ్ధిదారులు ధ్రువపత్రాలు తీసుకునేందుకు మీసేవా కేంద్రం, జిరాక్స్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు.



కౌడిపల్లి(నర్సాపూర్): జిరాక్స్ సెంటర్ వద్ద జనం

అడవికి రక్షణేదీ?



హవేళీఘనాపూర్ మండలం కప్రాయిపల్లి–రాజిపేట అటవీ ప్రాంతంలో తొలగించిన చెట్లు

- అనుమతులు లేకుండా చెట్ల తొలగింపు
- మొన్న నామాపూర్.. నేడు కప్రాయిపల్లిలో
- 50 ఎకరాల్లో మిషన్లతో నరికివేత
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మెదక్/హవేళీఘనాపూర్: రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఓ వైపు కోట్లు ఖర్చు చేసి హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటుతుంటే.. మరో వైపు అక్రమార్కులు ఇష్టారీతిన చెట్లను తొలగిస్తున్నారు. జిల్లాలో సమీప ప్రాంతాల్లో అనుమతులు లేకుండా చెట్లను నరుకుతూ అటవీ భూమిని చదును చేస్తున్నారు. హవేళీఘనాపూర్ మండల పరిధిలోని కప్రాయిపల్లి–రాజిపేట శివారులో నాలుగు రోజుల క్రితం కొంతమంది 50 ఎకరాల్లో వేలాది చెట్లను తొలగించి, జేసీబీలతో వాటి ఆనవాళ్లు లేకుండా చేయడం ఆందోళన కలిగిస్తోంది.

గతంలో ఘటనలు..
గత రెండేళ్లుగా జిల్లాలో పలు చోట్ల అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికేసిన ఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది పాపన్నపేట మండలం నామాపూర్, నార్సింగ్ మండలాల పరిధిలో సుమారు 100 ఎకరాల్లో మొక్కలను తొలగించి ట్రాక్టర్లతో చదును చేశారు. దీనిపై మీడియాలో కథనాలు రావటంతో పలువురిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. గతేడాది హవేళీఘనాపూర్ మండలం భూర్గుపల్లి, గాజిరెడ్డిపల్లి పరిధిలో ఓ అటవీ అధికారి కొంత మంది వద్ద ముడుపులు తీసుకుని 10 ఎకరాల అటవీ ప్రాంతాన్ని అప్పగించారు. విషయం బయటకు పొక్కటంతో ఆ అధికారిని బదిలీ చేశారే తప్ప చర్యలు ఏమీ తీసుకోలేదు. నాలుగు రోజుల క్రితం హవేళీఘనాపూర్ మండలం కప్రాయిపల్లి–రాజిపేట శివారులో 50ఎకరాల్లో చెట్లను తొలగించారు. విషయం బయటకు రావడంతో అధికారులు హడావుడి చేస్తూ విచారణ చేపట్టారు.

జిల్లాలో 24 శాతమే..

అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 58 వేల హెక్టార్ల మేర (24 శాతం) అడవులు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యాపార అవసరాల కోసం ఇష్టారీతిన అటవీ ప్రాంతాలను చదును చేస్తున్నా అధికారులు ఆ వైపు తొంగి చూడడంలేదు. సమీప గ్రామస్తులు, మీడియా ద్వారా విషయం బయటకు వస్తే తప్ప స్పందించడంలేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి ఉద్యోగులను నియమించి వారికి వాహనాలను అందిస్తున్నా.. అటవీ పరిరక్షణ మాత్రం సాధ్యం కావడంలేదు. యథేచ్ఛగా కబ్జా చేసి చెట్లను తొలగిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

చర్యలు తప్పవు

హవేళీఘనాపూర్ మండలం కాప్రాయిపల్లి–రాజిపేట అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన విషయం నా దృష్టికి వచ్చింది. విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అటవీ సంరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు.

– సైదులు, చీఫ్‌కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు

క్లుప్తంగా

పాము కాటుతో రెండు గేదెలు మృత్యువాత



మృత్యువాత పడిన గేదెలు

మద్దూరు(హుస్నాబాద్‌): పాము కాటుతో రెండు గేదెలు మృతిచెందాయి. ఈ సంఘటన మండలంలోని గాగ్గిళ్లాపూర్‌లో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని సాయిలు రోజుమాదిరిగానే మంగళవారం రాత్రి గేదెలను వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఇంటికొచ్చాడు. బుధవారం ఉదయం బావి దగ్గరికి వెళ్లి చూస్తే గేదెలు నురగలు కక్కి చనిపోయి ఉన్నాయి. పాము కాటు వేసిందన్న అనుమానంతో పశువైద్యాధికారులను సంప్రదించాడు. వారు అదే విషయాన్ని నిర్ధారించారు. సుమారు లక్షా 40వేల వరకు నష్ట వాటిల్లిందని రైతు వాపోయాడు.

తుదిగడువు 17 వరకు పొడిగింపు

వర్గల్‌(గజ్వేల్‌): 2024–25 విద్యాసంవత్సరం కోసం నవోదయలో ఆరో తరగతి ఎంట్రన్స్‌ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించిందని నవోదయ ప్రిన్సిపాల్‌ డీ రాజేందర్‌ తెలిపారు. ఈ నెల 10 గురువారంతో దరఖాస్తుల గడువు ముగియాల్సి ఉందని, కానీ ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు వీలుగా నవోదయ సమితి గడువు తేదీని 17 వరకు పొడిగించిందని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా పరిధిలోని మెదక్‌, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్‌: తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. బంగారపు వస్తువులు, నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన పటాన్‌చెరు పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇస్నాపూర్‌లోని హనుమాన్‌ నగర్‌ కాలనీలో నివాసం ఉంటున్న సిమెన్‌ ఓ చర్చి పాస్టర్‌. మంగళవారం ఇద్దరు పిల్లలను స్కూల్‌కు పంపి, ఉదయం 11:30 గంటలకు భార్య సుజాతతో కలిసి షాపింగ్‌ కోసం చార్మినార్‌ వెళ్లి సాయంత్రం వస్తే తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే బీరువాలోని వస్తువులు చిందరవందరగా కింద పడి ఉన్నాయి. అందులోని బంగారు పుస్తెలతాడు, లాంగ్‌ చైన్‌, కమ్మలు బుట్ట లు, నాలుగు రింగులు, ఏడు లక్షల నగదు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి శవమై...



జాదవ్‌ లక్ష్మణ్‌

కల్హేర్‌(నారాయణఖేడ్‌): గేదెలు కడిగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో గల్లంతైన వ్యక్తి విగతజీవిగా కనిపించాడు. సిర్గాపూర్‌ మండలం సంగం శివారులో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన జాదవ్‌ లక్ష్మణ్‌(45) మంగళవారం సాయంత్రం పొలం పక్కన ఉన్న నల్లవాగు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో గేదేలు కడిగేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. బుధవారం ప్రాజెక్టులో శవమై తేలాడు. మృతుడి భార్య రంగుబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కన్నవారికి కడుపు కోత మిగిల్చి..

నిర్మల్‌చైన్‌గేట్‌: పట్టుదలతో చదివి ట్రిపుల్‌ ఐటీలో సీటు సంపాదించాడు. ఉన్నతశిఖరాలకు చేరుకుంటానని దిగులు చెందవద్దని తల్లిదండ్రులకు భరోసానిచ్చాడు. ఇంతలో ఏమైందో ఏమో చేరిన వారంలోనే ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చాడు జాదవ్‌ బబ్లూ. ప్రాణాలు వెళ్లిన కొడుకు తిరిగి విగతజీవిగా రావడంపై కన్నవారు గుండలావిసెలా రోధిస్తున్న తీరు అందరినీ కంటతడిపెట్టిస్తోంది. నిర్మల్‌ జిల్లా బాసర ట్రిపుల్‌ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి జాదవ్‌ బబ్లూ మృతదేహాన్ని బుధవారం తల్లిదండ్రులు జాదవ్‌ సంతోష్‌, రుక్మిణికు అప్పగించారు. నిర్మల్‌ జిల్లా ఆస్పత్రిలో ఆర్‌ఎంఓ వేణుగోపాలకృష్ణ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య అప్పగించారు.

విద్యార్థి మృతదేహం అప్పగింత





రోదిస్తున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థి తల్లిదండ్రులు

ట్రిపుల్‌ ఐటీ విద్యార్థికి కన్నీటి వీడ్కోలు

సొంతూరు నాగపూర్‌లో ముగిసిన అంత్యక్రియలు



మనూరు: జాదవ్‌ బబ్లూ తండ్రి సంతోష్‌ నాయక్‌ను ఓదార్చుతున్న సురేశ్‌ షెట్కార్‌

నారాయణఖేడ్‌: బాసర ట్రిపుల్‌ ఐటీ విద్యార్థి జాదవ్‌బబ్లూ అంత్యక్రియలు మండలంలోని నాగపూర్‌లో బుధవారం సాయంత్రం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. అతను ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. అతడి పార్థీవదేహం సొంతూరకు మధ్యాహ్నానికి చేరుకుంది. అప్పటికే వేచియున్న కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతం అయ్యారు. మాజీ ఎంపీ టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడే సురేశ్‌ షెట్కార్‌ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతుడి తండ్రి సంతోష్‌నాయక్‌తోపాటు కుటుంబీకులను ఓదార్చారు. రూ.5వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కూడా సందర్శించి కుటుంబీకులను ఓదార్చారు.

చిన్నారిని చిదిమేసిన లారీ

- రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కొడుకు.. దుర్మరణం
- శోకసంద్రంలో దంపతులు
- అలిరాజ్‌ పేట శివారులో ఘటన



విద్యార్థి అఖిల్‌



కొడుకుపై పడి రోదిస్తున్న తల్లి

జగదేవ్‌పూర్‌ (గజ్వేల్‌): ఒక్కగానొక్క కొడుకు.. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు.. ఎన్నో ఆశలు, ఆశయాలతో చదివిస్తున్న దంపతులకు తీరని శోకం మిగిలింది. పదో తరగతి చదువుతున్న కుమారుడు పాఠశాలకు బైక్‌పై వెళ్తుండగా మృత్యురూపంలో లారీ కబళించింది. దీంతో దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మండల పరిధిలోని అలిరాజ్‌పేట శివారులో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన మిట్టపల్లి వెంకటేశం, అనిత దంపతులకు కొడుకు అఖిల్‌, కూతురు ఉన్నారు. అలిరాజ్‌పేటలో సెయింట్‌ విన్సెంట్‌ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ప్రత్యేక తరగతులు ఉండడంతో బుధవారం ఉదయం 8 గంటలకే బైక్‌పై పాఠశాలకు బయలుదేరాడు. అలిరాజ్‌పేట శివారులోకి రాగానే గజ్వేల్‌ నుంచి జగదేవ్‌పూర్‌ వైపు వస్తున్న లారీ, బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అఖిల్‌ తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ చంద్రమోహన్‌ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. పలువురు బాధితకుటుంబాన్ని పరామర్శించారు.

కారు ఢీ కొని బైకిస్టు మృతి



ప్రశాంత్‌ మృతదేహం

ములుగు(గజ్వేల్‌): మూత్ర విసర్జన చేసి బైకు పక్కన నిలబడిన బైకిస్టును కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం ములుగు మండల కేంద్రం రాజీవ్‌ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌ మండలం రిమ్మనగూడకు చెందిన జక్కుల ప్రశాంత్‌(25) మేకల వ్యాపారి. వ్యాపారం నిమిత్తం కుటుంబంతో కలిసి చెంగిచెర్లలో ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం చెంగిచెర్ల నుంచి బైక్‌పై సొంతూరుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో ములుగు వద్ద మూత్ర విసర్జన చేసి రోడ్డు పక్కన బైక్‌ వద్ద నిలబడిన అతడిని సిద్దిపేట వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అతడిని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రియుడి ఇంటి ముందు ధర్నా

నర్సాపూర్‌ రూరల్‌: ప్రియుడి ఇంటి ఎదుట వివాహిత బుధవారం ధర్నాకు దిగింది. నర్సాపూర్‌ మండలం రాంచంద్రాపూర్‌లో యువతికి 3 నెలల క్రితం సంగారెడ్డి జిల్లా పటాన్‌ చెరు మండలం రుద్రారానికి చెందిన యువకుడితో వివాహమైంది. అంతకుముందే గ్రామానికి చెందిన బుడ్డ భిక్షపతిని ప్రేమించింది. ఇటీవల పుట్టింటికి వచ్చిన ఆమె, అతను ఈనెల 5న ఓ ఆలయం వద్ద పెళ్లి చేసుకొని పోలీసులను ఆశ్రయించారు. వివాహిత అన్న విషయం తెలియక ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. తొలి పెళ్లి గురించి కుటుంబ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇరు కుటుంబాలు సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. పెద్దల ముందు వారు కలిసే జీవిస్తామని ఒప్పుకున్నారు. ఆమెను భిక్షపతి ఇంటికి పంపారు. ఈనెల 8న అతని కుటుంబ సభ్యులు వద్దని గెంటివేశారు. గ్రామపెద్దలు ఎంత నచ్చజెప్పినా వినలేదు. దీంతో ఇంటి ముందు ధర్నాకు దిగింది. పోలీసులు అందరినీ పోలీస్‌ స్టేషన్‌ కు తరలించారు. ఈ విషయమై నర్సాపూర్‌ ఎస్సై శివకుమార్‌ ను వివరణ కోరగా , ఇరు కుటుంబాలు గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకుంటామని చెప్పారని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

మునగచెట్టు కొమ్మ తొలగిస్తుండగా..

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నిజాంపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. సీఐ నవీన్‌ కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపూర్‌కు చెందిన పొట్టిపల్లి లింగమయ్య(45) ఓ కూలీ. అంగన్వాడీ కేంద్ర భవనం ఎక్కి మునగ చెట్టు కొమ్మ తొలగిస్తుండగా పక్కన ఉన్న విద్యుత్‌ వైర్లపై పడి షాక్‌ తగిలి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంలో మరొకరి...

రామాయంపేట(మెదక్‌): కరెంటు షాక్‌తో మంగళవారం రాత్రి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన దామరచెరువు గ్రామశివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన దిలీప్‌, మరో యువకుడు దామరచెరువు గ్రామశివారులో వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న కరెంట్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు దిలీప్‌ విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. అతని వెంట ఉన్న యువకుడు పారిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతను చికిత్సపొందుతూ మరణించాడు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రంజిత్‌ పేర్కొన్నారు.



దిలీప్‌ మృతదేహం

కనీస వేతనాల జీఓలను విడుదల చేయాలి

భారతీయ మజ్దూర్‌ సంఘ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారెడ్డి

కొండాపూర్‌(సంగారెడ్డి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోటీ 50 లక్షల కార్మికులకు లబ్ధి చేకూర్చే కనీస వేతనాల జీఓలను తక్షణమే విడుదల చేయాలని భారతీయ మజ్దూర్‌ సంఘ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సంగారెడ్డిలోని బీఎంఎస్‌ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. తొమ్మిది సంవత్సరాలుగా కనీస వేతనాల సవరణ కోసం బీఎంఎస్‌ పోరాడుతోందన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు గాలికొదిలేసిందని, సంఘాలను లెక్క చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల పొట్టకొట్టకుండా వెంటనే కనీస వేతనాల జీఓలను విడుదల చేయాలని, మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరించాలని డిమాండ్‌ చేశారు.ఆర్టీసీ విలీన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలనూ పరిష్కరించాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని, సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్‌ 26న జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్‌ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌, బీఎంఎస్‌ నాయకులు నర్సింహారెడ్డి, గణపతి, జనార్దన్‌ రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామారెడ్డి

వ్యాపారం సవ్యంగా సాగడం లేదని...

వ్యక్తి బలవన్మరణం



నీలకంఠం స్వామి

ఝరాసంగం(జహీరాబాద్‌): వ్యాపారం సవ్యంగా సాగడం లేదని జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నీలకంఠం స్వామి(37) కిరాణా దుకాణం వ్యాపారం చేసుకునేవాడు. కొన్నేళ్లు సోదరుడితో కలిసి వ్యాపారం చేశాడు. ఆరు నెలల క్రితం కేతకి సంగమేశ్వర ఆలయ ఆవరణలో నూతన కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. గిరాకీ సరిగా లేదని భార్యతో చెబుతూ మానసికంగా బాధపడేవాడు. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో దుకాణానికి వెళ్తున్నానన్నాడు. గ్రామ శివారులోని హనుమాన్‌ మందిరం వెనకాల సిద్దాపూర్‌ రోడ్డు పై పెట్రోల్‌ పోసుకొని, నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని జహీరాబాద్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్‌ రెడ్డి వివరించారు.

దశలవారీగా గొర్రెల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): దశలవారీగా అర్హులకు గొర్రెలు పంపిణీ చేస్తున్నట్లు ఉమ్మడి మెదక్‌ జిల్లా గొర్రె కాపరుల సహకార సంఘం చైర్మన్‌ శ్రీహరి యాదవ్‌ చెప్పారు. గొల్లకురుమల కుటుంబాల్లో సీఎం కేసీఆర్‌ వెలుగులు నింపారని అన్నారు. మండల పరిధిలోని గోనెపల్లిలో రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించారు. అర్హులకు గొర్రెలు అందజేస్తున్నట్లు చెప్పారు. గత పాలకులు తమ సంక్షేమాన్ని విస్మరించారన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్‌ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు ఈ పథకంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజమల్లయ్య, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, సర్పంచ్‌ స్వరూప ఎల్లాగౌడ్‌, ఎంపీటీసీ పద్మ మల్లేశం, పశువైద్యాధికారి మంజుల, ఇబ్బంది, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.



గోనెపల్లిలో...

డ్రోన్‌తో స్ప్రే ..

చిన్నకోడూరు(సిద్దిపేట): డ్రోన్‌ ద్వారా పొలాల్లో స్ప్రే చేయవచ్చని ఎఫ్‌పీఓ(రైతు ఉత్పత్తిదారుల సంస్థ) చైర్మన్‌ ఏలేటి వెంకట్‌ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రైతులు రాజిరెడ్డి, ప్రభాకర్‌ల మొక్కజొన్నకు స్ప్రే నిర్వహించారు. ఆపై డ్రోన్‌పై అవగాహన కల్పించారు. నానో యూరియా లాభాలు గురించి వివరించారు. అన్ని పంటలకు తక్కువ సమయంలో స్ప్రే చేయవచ్చన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు విధానంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో మార్కెటింగ్‌ మేనేజర్‌ కృపాశంకర్‌, ఎఫ్‌పీఓ డైరెక్టర్‌లు మహేందర్‌ రెడ్డి, మాదవరెడ్డి, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌ వాడే విధానాన్ని వివరిస్తున్న చైర్మన్‌

ఆటోను ఢీకొన్న లారీ

10 మందికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): లారీ, ఆటో ఎదురెదురుగా ఢీకొనగా 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని చంద్లాపూర్‌ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు కథనం ప్రకారం వివరాలు.. గ్రామానికి చెందిన దొడ్ల ఎల్లయ్య.. ఆటోలో సిద్దిపేట నుంచి ప్రయాణికులతో చంద్లాపూర్‌ వస్తున్నాడు. ఈ క్రమంలో చంద్లాపూర్‌ శివారులోని మలుపు వద్ద అతివేగంగా వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అంకువారి చంద్రకళ, కోటని కమల, దరిపల్లి కనకయ్య, కొమ్ముగల్ల లహరి, రాచకొండ లక్ష్మి, పెద్దోళ్ల చంద్రకళ, బోయిని సౌమ్య, వల్లెపు రంగవ్వతోపాటు ఆటో డ్రైవర్‌ ఎల్లయ్య, రిషి అనే బాలుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సుభాష్‌ గౌడ్‌ ఘటనా స్థలికి చేరుకొని ట్రాఫిక్‌ సరిచేశారు. క్షతగాత్రులను జడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ పరామర్శించారు.



గాయపడ్డ క్షతగాత్రుడు

పనులు వేగవంతం చేయాలి

ఝరాసంగం(జహీరాబాద్‌): రహదారి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నిమ్స్‌ అధికారులు తెలిపారు. (జాతీయ పెట్టుబడులు ఉత్పాదక మండలి) నిమ్స్‌ రోడ్డు పనులను నిమ్స్‌ అధికారులు పర్యవేక్షించారు. జహీరాబాద్‌ పరిధిలోని హుగ్గెల్లి నుంచి బర్దిపూర్‌ గ్రామశివారు వరకు సుమారు రూ. 100 కోట్లతో 9.5కిలోమీటర్లు 100 అడుగుల వెడల్పు పనులు, మండల పరిధిలోని మాచ్నూర్‌, బర్దిపూర్‌ గ్రామ శివారులో కొనసాగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. రహదారి నిర్మాణంలో భాగంగా అవసరం ఉన్నచోట కల్వర్టుల నిర్మాణ ప్రాంతాల కొలతలను సేకరించారు. వర్షాలతో పనులు సాగేందుకు ఇబ్బంది అవుతుందని, పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రతన్‌ రాథోడ్‌, జానకిరామ్‌ తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణానికి కొలతలు చేస్తున్న అధికారులు

చికిత్స పొందుతున్న ఓటాబంది వీఆర్‌ఏ మృతి

వట్‌పల్లి(అందోల్‌): చికిత్సపొందుతున్న ఓటాబందీ వీఆర్‌ఏ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నిర్జప్లకు చెందిన నాయికోటి సంగయ్య(60) ఆయా గ్రామాల ఓటాబందీ గ్రామ సహాయకులతో కలిసి బైక్‌పై అందోల్‌ ఆర్డీఓను కలవడానికి వెళ్తున్నాడు. మంగళవారం అందోల్‌ ఆర్డీఓ కార్యాలయం సమీపంలో బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు నర్సింలు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాయికోటి సంగయ్య

రైలు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి ..



రాములు

తూప్రాన్‌: మతిస్థిమితం లేని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్‌ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని వెంకటాపూర్‌ (పీటీ)కు చెందిన సంతోషపురం రాములు(62) కొంత కాలంగా మతిస్థిమితం లేదు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి రాలేదు. కాగా గ్రామ సమీపంలో రైల్వే పట్టాల పక్కన కొనఊపిరితో పడి ఉన్నాడు. రైల్వే ప్రయాణికులు స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడ చేరుకుని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కామారెడ్డి రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు అదృశ్యం

వేర్వేరు చోట్ల ఐదుగురు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరు పరిధిలో నలుగురు, తొగుటలో ఒకరు అదృశ్యమయ్యారు.

మెకానిక్‌ షాప్‌కు వెళ్తున్నానని..



మహమ్మద్‌ నూరాలం

పటాన్‌చెరు టౌన్‌: మెకానిక్‌ షాప్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణ కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన మహమ్మద్‌ నూరాలం, సోదరుడు మహమ్మద్‌ శంషాలం ఇక్రిసాట్‌ కాలనీలో నివాసం ఉంటున్నారు. వందనపురి కాలనీ సమీపంలో ఓ మెకానిక్‌ షెడ్‌లో నూరాలం పని నేర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో పనికి వెళ్తున్నానని చెప్పి మంగళవారం ఉదయం బయటకు వెళ్లి రాలేదు. శంషాలం స్థానికంగా, తెలిసిన వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో అతను ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్‌ సరుకు కోసం వెళ్లి...

పటాన్‌చెరు టౌన్‌: కొడుకు అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లికి చెందిన అజయ్‌ జాదవ్‌.. ప్లాస్టిక్‌ లోడ్‌ కోసం డీసీఎం వాహనం తీసుకొని ఈనెల 7న పటాన్‌చెరుకు వచ్చాడు. శేఖర్‌కు చెందిన గోదాంలో సరుకు ఎక్కిస్తున్నారు. ఇంతలో అజయ్‌ జాదవ్‌ ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కాల్‌ చేస్తే ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ అని వచ్చింది. దీంతో తండ్రి దిలీప్‌సురేష్‌ కుమారుడి కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. అతడి అదృశ్యంపై తండ్రి పోలీసులు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం ఎందుకు తాగుతున్నావు అన్నందుకు..



కన్నమ్మ

పటాన్‌చెరు టౌన్‌: మద్యం ఎందుకు తాగుతున్నావని భర్త అడగడంతో ఓ భార్య అదృశ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... మండలంలోని ఇంద్రేశంకు చెందిన భారత్‌ కవి రాములు గ్రామపంచాయతీ కార్మికుడు. భార్య కన్నమ్మకు మద్యం తాగే అలవాటు ఉంది. రోజూ ఎందుకు తాగుతున్నావని అడిగేసరికి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బయటకు వెళ్లొస్తానని..



పూజార

పటాన్‌చెరు టౌన్‌: బయటకు వెళ్లొస్తానని చెప్పి వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన పూజార పట్టణంలోని గౌతమ్‌నగర్‌ కాలనీలో ఉండి సెంట్రింగ్‌ పని చేసుకుంటున్నాడు. ఈనెల 7న మధ్యాహ్నం రూమ్‌లో ఉంటున్న వరుసకు కొడుకైన సుఖ్‌దేవ్‌కు ఫోన్‌ చేసి బయటకు వెళ్తున్నానని చెప్పి రాలేదు. తెలిసిన వారిని విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. సొంతరాష్ట్రంలోని కుటుంబసభ్యుల వద్దకు వెళ్లలేదన్నాడు. వెంటనే సుఖ్‌ దేవ్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితంలేని మహిళ..

తొగుట(దుబ్బాక): మండలంలోని మోతెలో జంగం బాలయ్య భార్య వజ్రవ్వకు మతిస్థిమితం సరిగాలేదు. మంగళవారం సాయంత్రం నుంచి ఆమె అదృశ్యమైంది. తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. బుధవారం పోలీస్‌ స్టేషన్‌లో భర్త బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేశ్‌ వివరించారు.